## 21. బాకీ - జమ

**శేఖర్రావుకి** నవ్వు వచ్చింది.

"పాపం అన్నపూర్ణ!" అనుకున్నాడు.

పొద్దున్న ఆఫీసుకి వస్తూ వుంటే మడత పెట్టిన కాగితం ఒకటి అతని కిస్తూ "కవరుకొని నాన్నగారి ఎడ్రసురాసి పోస్టులో వెయ్యండీ" అన్నది అన్నపూర్ణ.

కవరు తెప్పించి జేబులోంచి కాగితం తీశాడు శేఖర్రావు.

ఉత్తరం చాలా తేలిగ్గా వుంది.

తను మామగారికి ఉత్తరం రాసి చాలా రోజులయిపోయింది. ఈమధ్య 'మనవణ్ణి చూదామనుంది; ఓసారి రావాలనుకుంటున్నాను....' అని వ్రాశాడాయన. 'రండి, చాలా ఆనందిస్తాము. అసలు రమ్మని మేమే రాయాలనుకుంటున్నాము. చిట్టిగాడు 'తాత, తాత అంటున్నాడు' అని వ్రాయాలని (లేకపోతే బాగుండదని); అనుకున్నాడు తనే. కాని, ఏమిటో; రాయడమే పడలేదు.

పైగా మామగారికి ఉత్తరం రాయవలసిన సంగతేదైనా ఉంటే ఇద్దరి తరపునా అన్నపూర్ణే రాయడం మామూలు. అన్నపూర్ణ రాస్తోంది గదా అని అతను ప్రత్యేకం రాయకపోవడం - ఏదో అలా అశ్రద్ధ అయిపోతూ వస్తోంది.

పోనీ ఓ పేజీ ఖాళీగా వుంది. ఇందులో రాద్దామనుకుంటూ, అసలు అన్నపూర్ణ ఏమి వ్రాసిందో చూద్దామని, చదివాడు.

అన్నీ సరేకాని.

"ఎప్పుడో నాగవల్లి నాడు మీ రిస్తానన్న ఉంగరం ఇవ్వలేదని మీ అల్లుడుగారికింకా బాధగానే వుంది. ఏదో సమయం చూసి నన్ను దెప్పిపొడుస్తూ వుంటారు. ఈమధ్యనే ఓ మారు అన్నారు కూడానూ. అందుచేత ఈమారు మీరు వచ్చేటప్పుడు ఆయనికి మీరివ్వవలసిన ఉంగరం చేయించుకుని రావలెను. మరిచిపోవద్దు. అన్నయ్య వేలి కొలత...."

ఈ వాక్యాలు చూసేక శేఖర్రావుకి నవ్వు ఆగలేదు.

ఆ ఉంగరం సంగతి అతనెప్పుడో మరిచిపోయాడు.

మామగారు ఏవో యిస్తాననడం, తను ఏవో కావాలనుకోవడం, వాటికోసం పట్టుదలగా అడుగుతూ సమయం దొరికిందేచాలని సాధిస్తూ ఉండడం, ఇలాంటివంటే అసహ్యం శేఖర్రావుకి. చీటికీ మాటికీ మామగారిమీద ఆధారపడడం, వారు తన కోర్కెలు తీర్చకపోతే అలిగీ కోపపడీ బాంధవ్యాన్ని కలుషితం చేసుకోడం, అందువల్ల పరస్పరం పెరిగి లోపల్లోపల

వుడికి ఎప్పుడో ఒక్కసారి బైటపడే ద్వేషాలూ - యివి శేఖర్రావు తత్వానికి సరిపడవు. శక్తి వుంటే మనం కష్టపడి కొనుక్కోవాలి; లేకపోతే ప్రాప్తంలేదని వూరుకోవాలి- అనుకుంటా డతను.

అన్నపూర్ణని మొన్న నీ మధ్య ఆ విషయమై ఏదో అన్నట్టు అతనికి జ్ఞాపకం లేదనే చెప్పాలి. అతి కష్టంమీద వేళాకోళానికి అనడం జరిగిందని గుర్తు తెచ్చుకున్నాడతను.

అదెలా జరిగిందంటే, శేఖర్రావు అక్కగారు ఆ మధ్య వచ్చి ఓ వారం ఉండివెళ్ళింది. మాటలు సందర్భంలో ఆవిడేమో సరదాగా 'మీవాళ్ళు సామ్యం నిజం చేస్తున్నట్టున్నారే మరదలా. నాటినించి నేటివరకూ పెట్టుపోతల్లేవు. తిరిగి చూసినట్టయినా లేరు!' అన్నది. ఆ మాట మీద శేఖర్రావు 'అంతవరకూ ఎందుకూ, నాగవల్లి నా డిస్తానన్న ఉంగరానికే ఇంతవరకూ రికాణా లేదు' అన్నాడు ఎగతాళి చేసినట్టు.

అన్నపూర్ణ ఆనాడు ఆ మాటకి జవాబు చెప్పలేదు. శేఖర్రావు అదంతా అప్పుడే మరిచిపోయాడు. ఆ మాటని ఆమె మనసులో భద్రపరచుకొని మామగారికి రాసే ప్రతీ ఉత్తరంలోనూ రాసేస్తోందేమోనని శేఖర్రావుకి బాధ కలిగింది.

నిజం చెప్పవలసి వస్తే శేఖర్రావు తన వారెవరో ఎదుట వున్నప్పుడు అన్నపూర్ణని - మీ వాళ్ళూ, మీరూ, అలా చేశారు, ఇలా చేశారు - అంటూ ఎగతాళి పట్టించినా, అతనికి ఆమె అంటే ఉన్న గౌరవాభిమానాలు ఆమెకి బాగానే తెలుసును. ఇలాటి చిన్న చిన్న విషయాలు శేఖర్రావు పట్టించుకోడనీ, ఇచ్చిపుచ్చుకోడాల మీద అతనికి చాలా మెచ్చుకోతగ్గ అభిప్రాయాలున్నాయనీ, ఆమెకి తెలుసును.

అలాటి అన్నపూర్ణ యిలా రాసిందంటే శేఖర్రావుకి నవ్వు వచ్చి ఆ నవ్వు వెనక బాధ స్ఫుటంగా తెలియజేసింది. తను రాద్దామనుకున్న ఉత్తరమూ వ్రాయలేకపోయాడు. రాస్తే అన్నపూర్ణ వాక్యాల్ని తను సమర్థించినట్టొచ్చే అర్థం స్ఫురించి, అన్నపూర్ణ వ్రాసిన ఉత్తరానికి తన బాధ్యత ఏదో వుందని బాధపడసాగాడతను. అసలు ఆమె అలాటి ఉత్తరం రాసిందని తనకి తెలిసిన తరవాత తను ఆ ఉత్తరాన్ని వెళ్ళనివ్వనే కూడదనీ అనుకున్నాడు. ఆ కవరు మీద తన దస్తూరితో ఎడ్రసు ఉన్నా అందులో వాక్యాలు తన సమ్మతి పొందాయని అర్థం వొస్తుందేమో. అన్నపూర్ణ వ్రాసే ప్రతి ఉత్తరమూ తన సమ్మతి పొందాలనుకోవడమూ అన్యాయంగానే కనిపిస్తోంది.

శేఖర్రావు నవ్వుకుంటూ ఆలోచించుకుంటూ కవరు మీద ఎడ్రసు రాసి పోస్టుకి పంపించేశాడు.

"అయితే, అన్నపూర్ణా; ఎన్నో ఉత్తరమదీ?" అన్నాడు శేఖర్రావు నవ్వుతూ కంచం దగ్గిర కూచుని.

"ఏమిటి ఎన్నో ఉత్తరం?"

"అన్నట్టు చెప్పడం మరిచిపోయాను. మీ నాన్నగారికి నువ్వు రాసిన ఉత్తరం

చూశానివాళ - బాగా రాశావులే - మొత్తంమీద నేను మరిచిపోయినా నువ్వు మరిచిపోలేదా ఉంగరం సంగతి. ఏమైనా మీ నాన్నగారు ఇలాటి వాటికి లొంగే ఘటంకాదు."

శేఖర్రావు చెయ్యదల్చిన యీ కృత్రిమ అవహేళన కృత్రిమంగానే వొచ్చింది. అతను మాటలకోసం తడుముకోసాగాడు.

అన్నపూర్ణ మాటాడలేదు.

"మాట్లాడవేమీ? అంత సుళువుగా....."

"అంత బాగా అర్థం చేసుకున్నారన్నమాట, మీ రాయన్ని."

"ఏముంది యిందులో - అర్థం చేసుకోడానికీ మానటానికీనూ? మన పెళ్లయి ఏడేళ్ళయిపోయింది. పాపకే వెళుతున్నాయి ఆరేళ్ళు. ఇంకో ఏడేళ్ళు కళ్ళు మూసుకుంటే మనమూ అల్లుడికి ఉంగరమూ, వాచీ, సైకిలూ కొనే అవసరం వొస్తుంది. ఇంకా ఎక్కడి నాగవిల్లి అలకలు, ఎక్కడి ఉంగరాలు!"

"మా వాళ్ళేదీ అలా మరిచిపోరు. ఈ మాటు తెస్తారు చూడండి."

"తేరు"

"తెస్తేనో?'

"తేకపోతేనో?"

"పోనీ పందెం వెయ్యండి. తెస్తే ఏమిస్తారు?"

"నీకేమిటి ఇవ్వడం మధ్యని!"

"మీ కెలాగా సరదా లేదు. నా కిచ్చేస్తారా ఆ వుంగరం?"

"నీ కెందు కిస్తానూ? అంతగా నువ్వు అడుగుతున్నావు గనక ఇదే పందెం. మీ నాన్నగారు ఉంగరమే గనక యిచ్చినట్టయితే ఏ దారేబోయే దానయ్యకో యిచ్చేస్తానది. లేకపోతే ఆ యేడు కొండలవాడి కిచ్చేస్తాను, సరా!"

"ఎవ్వరికీ యివ్వరూ. మహా చక్కగా పెట్టుకుంటారు. బంగారమా బలుసుకొయ్యా?"

"చూద్దువుగాని, ఇంతకీ ఆయన ఇచ్చినప్పటి మాట కదా!"

"ఆయన యివ్వనూ యిస్తారు, మీరు పుచ్చుకోనూ పుచ్చుకొంటారు. ఎందుకొచ్చిన పందేలు? ఇంతకీ మిమ్మల్నా ఉత్తరం ఎవరు చదవమన్నారు?"

"చదివితే చదివాను. నువ్వందులో ఉంగరం సంగతెందుకు రాశావూ?"

"నేనేం నాకోసం రాయలేదు. మీకేగదా ఒస్తుంది ఉంగరమని ఏదో రాశాను. అడగందీ యెవరిస్తారు?"

"అడిగితే అడుగుగాని, నేనేదో సాధిస్తున్నాననీ, దెప్పుతున్నాననీ రాయడ మెందుకూ?"

"ఏదో రాశానండీ. మీరవన్నీ చదవడమేమిటి?"

"నయం. ఇప్పటికేనా చదివి నీ తత్వం తెలుసుకున్నాను. ఇంకా ఎవరెవరికి ఎలా టెలాటి ఉత్తరాలు రాసేస్తున్నావో ఏమో. ఇక ముందు అన్నీ చూస్తూ ఉంటాను."

❖ ❖ ❖

శేఖర్రావుకి ప్రమోషనొచ్చింది. ఈ ప్రమోషన్ కోసం అతను నాలుగేళ్ళనించీ ఎదురు చూస్తూ అవస్థ పడుతూ వున్నాడు. ఒక ఆఫీసరు డిపార్టుమెంటల్ టెస్టు ప్యాసవలేదనీ, ఇంకొకాయన ప్రభుత్వం వారిచ్చిన కమ్యూనల్ జీ.వో. ప్రకారం నీ కిది రాదనీ, యిలా ముప్పాతిప్పలూ పెట్టగా పదకొండుమంది తనకన్నా జూనియర్లూ, తనపాటి టెస్టులు కూడా ప్యాసవని వాళ్ళూ ముందు ప్రమోట్ కాగా యీ మాటు ఆతనికొచ్చింది; ఈ ప్రమోషన్. భర్త యిన్నాళ్లూ అడ్డమైన వాళ్ల కాళ్లూ పట్టుకుంటూ అడ్డదార్లు తొక్కుతున్నాడని తెలిసి ప్రమోషనొస్తే కొండకొచ్చి నీదర్శనం చేసుకుంటామని శ్రీ వెంకటేశ్వరస్వామికి మొక్కుకుంది అన్నపూర్ణ. అది యిప్పుడు చెప్పి బయల్దేరమంది.

ససేమిరా వల్లకా దన్నాడు శేఖర్రావు. "నా కసలు అలాటి పిచ్చి నమ్మకాల్లేవు. నువ్వు మొక్కుకునే ముందు నాతో ఆలోచించవలసింది. ప్రమోషనొచ్చిన కొత్తలోనే పదిరోజులు సెలవడిగితే ఆఫీసరు సెలవు యివ్వడు సరిగదా నా గురించి దురభిప్రాయ పడతాడు కూడానూ. అంతగా వెళ్ళే తీరాలని నువ్వనుకుంటే మీ అన్నయ్యని రమ్మని రాయి. ఇద్దరూ కలిసి పిల్లల్ని తీసుకు వెళ్ళండి' అన్నాడు.

అన్నపూర్ణ అలా వీల్లేదంది. దేముడికి మొక్కుకోడానికి మీతో ఆలోచించడమేమిటి, ఇంతకీ నేను మొక్కుకోబట్టి కదా మీకీ ప్రమోషనొచ్చింది. తిరపతి వెళ్తానని సెలవడిగితే ఇవ్వనని యే ఆఫీసరూ అనడు. మీరసలు సెలవడిగి చూడండి. మీరే రావాలి, మా అన్నయ్య రాకపోడు గాని మీతో వెళ్ళిన సాటొస్తుందా? అని వాదించింది.

"అదేమో నాకు తెలీదు. ప్రతీదానికి ఏమిటి నీ అల్లరి? నా దగ్గిరిప్పుడు డబ్బులేదు" అన్నాడు శేఖర్రావు.

"అబద్ధాలాడకండి. అందులో స్వామి దర్శనానికి చేసేయాత్ర ఎగ్గొడదామనుకోడం మహా పాపం. మీ దగ్గిర నిజంగా డబ్బు లేదూ?" అంది అన్నపూర్ణ చిలిపిగా నవ్వుతూ.

ఈ ప్రమోషను బాపతు వుద్యోగంలో శేఖర్రావు తొమ్మిది నెల్లుగా కింది ఉద్యోగం జీతంమీదే యాక్టుచేస్తూ వుండడంవల్ల ఈ ఇచ్చిన ప్రమోషన్ ఆ యాక్టుచేస్తున్న తేదీనించి వర్తించేటట్టు యివ్వడం జరిగింది. అందుమూలంగా తేడా జీతం తొమ్మిది ముప్పయిలు రెండు వందల డెబ్బై, కరువు భత్యం దాదాపు యాభై అంతా మూడు వందల యిరవై రూపాయలవరకూ శేఖర్రావుకి ఇవాళే ముట్టింది. ఆఫీసులో టీ పార్టీ చేశాడు కూడానూ, అతను. ఆ విషయమంతా సాయంకాలం 'పేప్స్' పట్టుకొచ్చిన ప్యూను వివరించి చెప్పి; 'అయ్యగారు బంగారమంటివోరమ్మా. ఎంత అదృష్టమో నీది' అని వో కాంప్లిమెంటు పారేసి వెళ్ళాడు. "ఏడిశావులే నోరు ముయ్యి" అనవలసిన అన్నపూర్ణ ఆ వృద్ధుడి మాటలకి గుండెల్లోంచి పులకరించిపోయింది.

ఎలాగో బయల్దేరదీసింది భర్తని అన్నపూర్ణ. పిల్లల్నిద్దర్నీ భార్యనీ తీసుకుని తిరుపతి బయల్దేరాడు శేఖర్రావు.

దేవస్థానం ఆఫీసులో, సత్రంలో గదికోసం ఘర్షణ అయింది గాని పనికాలేదు. ఇవతలికొచ్చి మార్గాంతరం ఏమిటా అని ఆలోచిస్తూ అన్నపూర్ణ అడిగే ప్రశ్నలకి సమాధానం చెబుతున్నాడు శేఖర్రావు.

"అటుచూడూ, మీ నాన్నగారు కాదూ? ఇక్కడికెలా వొచ్చారీయనా?" అన్నాడతను హఠాత్తుగా.

"అరె! నాన్నగారే!" అంది అన్నపూర్ణ.

శేఖర్రావు మామగారు అతను వేసిన కేక విని వచ్చాడు. ఆయనా వాళ్ళని అక్కడ చూసి ఎంతో ఆశ్చర్యపడ్డాడు. "ఈయన గార్ని మళ్ళీ చూద్దామని ఎన్నాళ్ళనించీ అనుకుంటున్నా పడిందిగాదు. ఏం పేరే అమ్మాయి వీడిదీ?" అని శేఖర్రావు కొడుకుని ఒకటే ముద్దులాడ్డం ప్రారంభించాడు.

"అదిసరే గాని - మీరిక్కడి కెలా వచ్చారు నాన్నా? కూడా ఎవరైనా వచ్చారా?

వ్యాపారం పని మీద మద్రాసు వెళ్ళడమూ, స్నేహితుడి కొడుక్కి తిరుపతిలో జరిగిన పెళ్ళికి అక్కణ్ణించే రావడమూ చెబుతూ ఇంకో అరగంటలో ఇంటికి బయల్దేరుతున్న సంగతీ చెప్పాడాయన.

"మీరు కనపడకపోతే చాలా అవస్థ పడిపోదునే. ఇంకా గుంటూర్లో దిగి మీ యింట్లో ఒకపూట వుండి వెళదామనుకున్నాను. నయమే. ఇదుగోనయ్యా శేఖరం. నీ కిస్తానన్న ఉంగరం. ఎంతోకాలంగా అనుకోడం - అశ్రద్ధ అయిపోడం, మరేం అనుకోకు నాయనా; మొన్న మద్రాసులో సడన్‌గా జ్ఞాపకమొచ్చి "వీకమ్‌సీస్"లో రడీమేడ్ వుంటే తీసుకున్నాను. ఏదో ఆలస్యమైనా అనుకున్నట్టు కుదిరింది."

శేఖర్రావు సిగ్గుతో ముడుచుకుపోయాడు.

"లేదండీ. నే నా మాటెప్పుడో మరిచిపోయాను. అన్నపూర్ణే నే నెప్పుడో సరదా కన్నమాట పుచ్చుకుని రాసింది. నాకిల్లా కొసాకీ పుచ్చుకుంటూ వుండడమంటే యిష్టంలేదు. మీకూ తెలుసుగా!" అన్నాడతను ఇబ్బందిపడుతూ.

అన్నపూర్ణ చురుగ్గా ప్రశ్నార్థకంగా చూసింది అతనివేపు.

"అదేమిటి నాయనా ఆ మాట. నేనిస్తానన్నదే గాని నువ్వు నన్ను అడిగి విసిగించిందేముంది యిందులో! అమ్మాయి రాసిందనే తెచ్చాననుకున్నావా? మెద్రాసు వెళ్ళడం, మా స్నేహితుడు వాళ్ళ కోడలికి పెట్టబోయే వస్తువుల కోసం షాపుకి వెళ్ళడం జరక్కపోతే యిప్పుడూ తెచ్చివుండేవాణ్ణి కాదు. ఏదో దైవకృప వల్ల యిప్పటికి సరైన టైములో గుర్తుకొచ్చింది. అశ్రద్ధ చేసేనని ఏమనుకోకు. మంచివాడివి గనక అలా వూరుకున్నావు. స్వల్పానికి తేలిపోకుండానూ" అంటూ కూతురి చేతిలో పెట్టాడాయన ప్యాకెట్టుని.

"మీరు కూడా వుండండి నాన్నా. రెండు మూడు రోజులుండి ఇవన్నీ చూసేసి అందరమూ కలిసి వెళదాం. ఎలాగూ గుంటూర్లో దిగే ఉద్దేశం ఉందిగదా."

"అయ్యో, నన్ను బలవంతం చెయ్యకు తల్లీ. ఇప్పటికే చాలా లేటయిపోయింది. ఇక్కడికి రావడానికే ఎంతో యిదయ్యాన్నేను. ఏదో దైవకృపవల్ల ఇక్కడ కలిశాం. పిల్లల్నీ, నిన్నూ చూశాను. నన్నిలా వెళ్ళనీ..."

ఆయన వెళ్ళాడు. అన్నపూర్ణ కుతూహలంగా ఉంగరం చూసింది. చాలా బాగుంది. అయితేనేం అది పెట్టుకోడానికి శేఖర్రావు ఏమీ ఉత్సాహం చూపించడం లేదు. "మీ నాన్నగార్ని పీడించి తెప్పించావు. పైగా నేనేదో సాధించినట్టూ, దెప్పిపొడిచినట్టూ ఉత్తరాలు రాసి నన్నో రాక్షసుళ్ళా చిత్రించావు. నాకిది అక్కర్లేదు. నీ యిష్టమొచ్చినట్లు చేసుకో" అన్నాడతను.

"ఆయన్ని ఒదిలి నా దగ్గిర అలుగుతున్నారేమిటండోయ్!" అంది అన్నపూర్ణ.

"ఛీ ఊరుకో. నన్ను ఆఖరికి ఎల్లా అర్థం చేసుకున్నావు!"

"కొత్త వస్తువు; వెంటనే వాడాలి" అని చెప్పి ఎలాగో శేఖర్రావు వేలికి తొడిగింది అన్నపూర్ణ. శేఖర్రావు వేళ్ళు ఉంగరాలు పెట్టుకుందికి వీలైనవి. చక్కని కండగలవి. అనుభవం ఉన్న బత్తుడు చేసినదీ, బాధ్యతగల వ్యాపారసంస్థ అందించిందీ గనక కాబోలు, పనితనం, ఆకారం, వర్ణం కుదిరి చక్కగా ఉంది ఉంగరం. 'శేఖర్' అని చెక్కి వున్న పేరులోని అక్షరాలు ప్రత్యేకంగా ఎవరికైనా నచ్చేటంత అందంగా వున్నాయి. కొంచెం ఒదులుగా వుందన్నమాట గాని, చాలా చక్కగా అమిరింది అతనికా ఉంగరం. బావుందని అతనే ఒప్పుకున్నాడు. 'అక్కర్లేదన్నాడు గాని, ఎలాగో పెట్టుకుంటాడు లెమ్మని సమాధానపడింది అన్నపూర్ణ.

"కొంచెం లూజుగా ఉంది గదూ. మన వూరెళ్ళాక చిన్న ముక్క తీయించి సైజుకు చేయించుకుందాం లెండి."

ఆ సాయంత్రానికి తిరుమల చేరుకొని మర్నాడు పొద్దున్నే గుడిలోకెళ్ళి దర్శనం, మొక్కు అన్నీ అయ్యేక గుడిదాటి యివతలికొచ్చారు శేఖర్రావు దంపతులు.

ఇరుగూ, పొరుగూ అడుగుతారని అయితేనేం, సరదా తీరడానికయితేనేం, బొమ్మలషాపు దగ్గిరకొచ్చి చందనపు బొమ్మలు ఎంచింది అన్నపూర్ణ.

"డబ్బిచ్చే సెయ్యండి."

అప్రయత్నంగా ఆమె చూపు జేబులోంచి బైట పడుతున్న శేఖర్రావు చేతిమీద పడింది.

వేలిని ఉంగరం లేదు.

రెండోచేతి వేలికి పెట్టుకున్నాడేమో అనుకుంటూ అటు చూసింది. ఆ చేత్తో పాపని పట్టుకున్నాడు శేఖర్రావు. దాన్నీ లేదు, ఉంగరం.

"ఉంగరమేదండీ?" అంది గాభరాగా అన్నపూర్ణ.

శేఖర్రావు నవ్వాడు.

"దాచారా యెక్కడైనా? లూజుగా వుంది. ఎక్కడైనా పడ్డదేమోనని హడిలిపోయాను"

శేఖర్రావు చల్లగా 'పోయింది' అన్నాడు.

"వోశ్, నిజం చెప్పండి, దాచలేదూ?"

"నిజమే. ఇంతకుముందే హుండీలో డబ్బులేస్తూ ఉంటే జారిపడింది. సరే స్వామికేగదా వెళ్ళిందని చెప్పలేదు నీతో. ఇంత తొందరగా చెప్పవలసొస్తుందని అనుకోలేదు" అన్నాడు శేఖర్రావు నవ్వుతూ.

"నిజం?"

అన్నపూర్ణ మొహంలో విచార రేఖలు కనబడుతున్నాయి. వాటి ఫలితం కొంత కాలం - బహుశా చాలా కాలం - వ్యధ. నాన్నగారు పెళ్ళినాడు అన్నమాట ప్రకారం యిచ్చిన ఉంగరం, చాలా చర్చకి కారణమైన కానుక, ఏమీ కాకుండాపోయిందే అని ఆమె పడబోయే బాధ శేఖర్రావుకి స్పష్టంగా కనబడుతోంది. అది పంచుకోడానికి గాని, ఆమెని అనుభవించనియ్యడానికి గాని అతను సిద్ధంగా లేడు. అతను ఉపాయం వెతుక్కోడానికీ సమయం లేదు.

"నిజమే - ఎందుకలా బాధపడతావు? మనం యిస్తామన్నదేగా; మరిచిపోయావా? ఆనాడు పంతానికి - మీ నాన్నగారు ఉంగరం యివ్వడమే తటస్థిస్తే ఏడుకొండలవాడి కిస్తానన్నానుగా!"

"ఎంతపని చేశారండి - కావాలనే చేసినట్టున్నారు; నమ్మకం లేదంటూ కూడానూ."

"ఇందులో నమ్మకాని కేముందీ? నువ్వు మరిచిపోయినా ఆ స్వామి మరిచిపోకుండా జమ కట్టుకున్నాడు - అసాధారణమైన శక్తి సుమా ఆయన్ది! కాకపోతే ఏడేళ్ళనాడు ఉంగరం యిస్తానన్న పెద్దమనిషి ఇన్నాళ్ళూ యివ్వకపోవడమేమిటి, మనం తిరపతి ఒస్తున్నామని తెలియకపోయినా మీ నాన్నగారు యిక్కడ తటస్థపడి యిచ్చేసి చక్కాపోవడమేమిటి! - వ్యాపారం పనంటూ ఒకటి కల్పించి ఆయన్ని మెడ్రాసు పంపించి, అక్కడ కొనిపించి, స్నేహితుడి కొడుకు పెళ్ళి ఒకటి ఏర్పాటుచేసి ఇక్కడికి రప్పించి - అంతా తనకి రావలసిన ఉంగరం కోసం ఆ స్వామి చేసిన మాయ కాదూ?" అన్నాడు శేఖర్రావు.

క్షణంలో విచారమంతా మరిచిపోయింది అన్నపూర్ణ. ఆమె కళ్ళు జ్యోతుల్లా మెరిశాయి. 'ఇప్పుడు తెలిసిందా మీకు, ఆ స్వామి మహిమ!' అంది పారవశ్యంతో నవ్వుతూ.

శేఖర్రావు సంతోషించాడు. అన్నపూర్ణకి నచ్చజెప్పడం ఎంత సులువు! "ఇంకా నయంకాదూ! ఆ ఉంగరంకోసం మరో ట్రిప్పు వేయించకుండా ఎవరికీ ప్రాణం మీదికి తేకుండా ఏదో పనిలో పని జరిపించి రైలు ఖర్చులు మిగిల్చాడు" అన్నాడు.

అన్నపూర్ణ తృప్తిగా గోపురంకేసి తిరిగి నమస్కారం చేసి లెంపలేసుకుంది.

*("జ్యోతి" మాసపత్రిక : మే 1963)*